# మిస్టరీ

**— రంగనాథ**

**రుడాల్ఫ్ లైవెంటినో ఆనాటి సినీ ప్రేక్షకుల కలల రాజు! అందుకు ప్రధాన కారణం సమ్మోహనమైన అతని రూపమే!**

**'జయంత వసంత కంతులన్ చక్కదనమున గెలువ జాలినవాడు' — అన్నట్టు దృఢంగా, ఆరోగ్యంగా, అందంగా, మగసిరి వుట్టిపడేలా వున్న రుడాల్ఫ్ 1920నాటికే హాలివుడ్‌లో గొప్ప అందాల నటుడిగా పేరు పొందాడు.**

పాతికేళ్ళ రుడాల్ఫ్ కండలు తిరిగిన శరీర సౌష్ఠవంతో చెక్కిన శిల్పంలా వుండేవాడు. ఏ డ్రెస్ వేసినా అతనికి అందంగా వుండేది. ఆనాటి టీనేజ్ అమ్మాయిలు మొదలు వయస్సు బిగువులు కోల్పోయిన అమ్మాజీల వరకూ రుడాల్ఫ్ గురించి కలలు కనేవారు. అతన్ని కలుసుకోవాలని, అతన్ని చూడాలని, అతనితో మాట్లాడాలని, అతన్ని తాకాలని, వీలైతే కనీసం ఒక్కసారైనా అతనితో గడపాలని తలపోసేవారు.

అలాంటి రుడాల్ఫ్ లైవెంటినోకు బంగారు వస్తువులు సేకరించడం హాబీ! కంటికి వచ్చిన ఏ బంగారు వస్తువైనా అతను వొదిలేవాడు కాదు. 'డైమండ్ రింగ్' మొదలు 'టైపిన్ను' వరకూ అతను సేకరించిన వస్తువుల జాబితాలో వుండాల్సిందే. అలాంటి వస్తువుల్ని కొనడంలో రుడాల్ఫ్ వెనకా ముందు చూచేవాడు కాదు. ఎంత ఖరీదైనా వాటిని కొని తన సొంతం చేసుకునేవాడు. అలా అతను కొన్న వస్తువుల్లో వో 'ఉంగరం' వుంది!

ఒసారి రుడాల్ఫ్ 'శాన్‌ఫ్రాన్సిస్కో' వెళ్ళాడు. అక్కడే అతను ఆ ఉంగరాన్ని చూడటం తటస్థించింది. విచిత్రమైన డిజైన్‌తో నగిషీలు చెక్కిన ఆ వుంగరం రుడాల్ఫ్‌ను విపరీతంగా ఆకర్షించింది. రుడాల్ఫ్ వెంటనే ఆ వుంగరాన్ని కొనేశాడు.

ఆ ఉంగరాన్ని కొన్న కొద్ది రోజుల తరువాత రుడాల్ఫ్ "ది యంగ్ రోజా" చిత్రంలో నటించాడు. అందులో తనను విపరీతంగా ఆకర్షించిన ఉంగరాన్ని ధరించి షూటింగ్‌లో పాల్గొన్నాడు. ఆ చిత్రం విడుదలై ఘోరమైన అపజయాన్ని చవి చూసింది. ఆ దెబ్బతో అంత వరకు మకుటం లేని మహారాజుగా వెలిగిని రుడాల్ఫ్‌కు రెండేళ్ళ వరకు ఒక్క చిత్రంలో కూడా అవకాశం రాలేదు.

హఠాత్తుగా తన చిత్రం దెబ్బ తిన డానికి తను ధరించిన వుంగరానికి ఏమైనా సంబంధం వుందా అన్న ఆలోచన వచ్చింది. అతని మిత్రులు కూడా ఆ వుంగరాన్ని ధరించటం మానేయవలసిందిగా సలహా యిచ్చారు. రుడాల్ఫ్ మిత్రుల సలహాతో ఆ ఉంగరాన్ని ధరించటం మానేశాడు. అనుకోకుండా అతనికి చిత్రంలో నటించే అవకాశం మళ్ళీ వచ్చింది. అప్పుడు నటించిన చిత్రం బాక్సాఫీసును బ్రద్దలు కొట్టడంతో రుడాల్ఫ్ తను కోల్పోయిన స్థానాన్ని మళ్ళీ సంపాదించుకున్నాడు.

1926లో రుడాల్ఫ్‌కు 'సన్ ఆఫ్ ది షేక్' చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. రుడాల్ఫ్ మళ్ళీ ఆ ఉంగరాన్ని ధరించి షూటింగ్‌లో పాల్గొన్నాడు. ఆ చిత్రం షూటింగ్ పూర్తయిన మూడు వారాల తర్వాత అతనో విందులో పాల్గొనవలసి వచ్చింది. రుడాల్ఫ్ విందుకు ఆ వుంగరాన్ని ధరించి వెళ్ళాడు.

విందు మధ్యలో హఠాత్తుగా రుడాల్ఫ్‌కు కడుపు నొప్పి వచ్చింది. భరించలేని నొప్పితో అతను మెలికలు తిరిగిపోవటం గమనించి అతన్ని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. రుడాల్ఫ్‌తో కలసి ఎన్నో చిత్రాల్లో నటించిన పోలా నెగ్రే కూడా ఆ విందులో పాల్గొనటానికి వచ్చింది. రుడాల్ఫ్ పరిస్థితి గమనించిన పోలానెగ్రే ప్రతిరోజూ హాస్పిటల్‌కు వెళ్ళి రుడాల్ఫ్ యోగక్షేమాలు విచారించి వచ్చేది.

హాస్పిటల్‌లో చేర్పించబడ్డ రుడాల్ఫ్ రెండు వారాల పాటు వైద్యులకే అంతు బట్టని కడుపునొప్పితో నరకయాతన అనుభవించి కన్నుమూశాడు.

రుడాల్ఫ్ మరణంతో ఉంగరం కథ ఆగిపోలేదు. రుడాల్ఫ్ జ్ఞాపకార్థం పోలానెగ్రే ఆ వుంగరాన్ని తీసుకుంది. అందుకురుడాల్ఫ్ తరపున వారెవరూ అభ్యంతరం చెప్పలేదు.

ఆ వుంగరాన్ని తన దగ్గరుంచుకున్న కొద్ది రోజుల్లోనే పోలానెగ్రే మంచం పట్టింది. రోజురోజుకు ఆమె ఆరోగ్యం క్షీణించసాగింది. ఆమెను పరీక్షించిన డాక్టర్లెవరికీ ఆమె జబ్బు అంతుబట్టలేదు. సంవత్సరంపాటు మంచంలో గడిపిన పోలానెగ్రే 1927లో ప్రాణాలు విడిచింది. ఆమె మరణానంతరం ఆ వుంగరం ఆమె అభిమాని 'రేస్‌కొలంబో'ను చేరుకుంది. రేస్‌కొలొంబో కొద్దో గొప్పో రుడాల్ఫ్‌ను పోలి వుండేవాడు. ఆ కారణంగానే పోలానెగ్రే తన మరణానికి ముందు — 'మొదటి రుడాల్ఫ్ నుండి రెండవ రుడాల్ఫ్‌కు' అని రాసిన వో మెసేజ్‌తోపాటు ఉంగరాన్ని రేస్ కొలొంబో చేతుల్లో వుంచింది.

ఆ వుంగరాన్ని ధరించిన రేస్ కొలొంబో వారం రోజులలోపే వో కారు ప్రమాదానికిగురై ప్రాణాలు కోల్పోయాడు.

రేస్ కొలొంబో మిత్రుడైన ప్రసిద్ధ హాస్య నటుడు జోకైసిన్ దగ్గరికి ఆ వుంగరం చేరింది. జరిగిన దుర్ఘటనలకు ఆ ఉంగరానికి ఏ విధమైన సంబంధం లేదని మూఢ నమ్మకాలతో కొందరు వాటి మధ్య సంబంధాన్ని అంట గడుతున్నారని జోకైసిన్ భావించాడు. అయితే రేస్ కొలొంబో మరణించిన కొద్ది కాలానికే జోకైసిన్‌వో మోటర్ వాహనానికి బలై ప్రాణాలు పోగొట్టుకున్నాడు. అప్పుడా సమయంలో అతని వేలికి ఆ ఉంగరం వుంది!

ఆ సంఘటనతో ఆ ఉంగరం పేరు పత్రికల్లో ప్రముఖంగా చోటుచేసుకోసాగింది. ఉంగరం గురించి విన్నవాళ్ళు, చదివినవాళ్ళు ఎవరికి చేతికి వుంగరాన్ని చూసినా అనుమానంగా చూసేవారు. తమ చేతులకు వున్న



వుంగరాలను కూడా అప్పుడప్పుడు అప నమ్మకంతో చూసుకునేవారు.

జోక్లైసిన్ సోదరుడు డేల్ ఆ వుంగ రాన్ని స్వాధీనం చేసుకున్నాడు. 'తానా వుంగరాన్ని ధరిస్తానని' స్నేహితులతో చెప్పాడు. జరిగిన సంఘటనలకు – వుంగరానికి ఏదో సంబంధం వుందని మూఢంగా నమ్మటాన్ని డేల్ తీవ్రంగా విమర్శించాడు.

కొంత కాలంగడిచింది. 'ఉంగరం' గురించి అందరూ మరచిపోతున్నారు అనుకునే సమయానికి డేల్ యింట్లో దొంగతనం జరిగింది. దొంగ యింట్లో వుండగానే పోలీసులు ఆ యింటిని చుట్టూ ముట్టారు. దొంగను ఆపే ప్రయత్నంలో వో పోలీసు అధికారి తుపాకిని గాలిలో పేల్చాడు. అయితే సరిగ్గా తుపాకి పేలే సమయానికి వో కానిస్టేబుల్ చేయి తగిలితుపాకి కిందకు దిగి అందులోంచి దూసుకొ చ్చిన గుండు దొంగ గుండెల్ని చీల్చింది. దొంగ నుంచున్న పాటున నేలకూలి ప్రాణాలు వదిలాడు. ఆ సమయంలో దొంగ చేతుల్లో దొంగిలించిన వస్తువుల్లో 'ఉంగరం' కూడా ఉంది!

పై సంఘటన జరిగిన తరువాత వుంగరం పోలీసుల స్వాధీనంలో వచ్చింది. ఆ ఉంగరం తమ దగ్గరున్నంత కాలం పోలీసులు వులికి వులికి పడేవారు. ఏ సమయంలో ఏమవుతుందో అని ఆందోళన చెందేవాళ్ళు. సరిగ్గా అదే సమయంలో వో సుప్రసిద్ధ హాలివుడ్ నిర్మాత రుడాల్ఫ్ లైవెంటినో జీవితాన్ని సినిమాగా తీద్దామనుకుని అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకున్నాడు. రుడాల్ఫ్ పాత్రకు వో ఇరవై ఏళ్ళ యువకుణ్ణే ఎన్నుకున్నాడు.

'రుడాల్ఫ్' మరణానికి ఉంగరానికి ఏదో చెప్పలేని సంబంధం వుందన్న కారణాన చిత్ర దర్శకుడు పోలీసుల దగ్గర్నుంచి ఆ ఉంగరాన్ని సంపాదించి చిత్రంలో ఆ ఉంగరాన్ని ఉపయోగించుకోవాలనే ఆలోచనతో దాన్ని ఆ చిత్రంలో నటించే హీరోకు యిచ్చాడు. అది ధరించిన కొద్ది గంటల్లోనే అతడి ఆరోగ్యం పాడైంది. అతన్ని వెంటనే హాస్పిటల్‌లో చేర్పించారు. ఆ చిత్రం పూర్తి కాకుండానే ఆ యువకుడు మరణించాడు.

ఈ సంఘటనతో పోలీసులు ఉంగరం జనుల మధ్య వుండటం మంచిది కాదన్న అభిప్రాయానికి వచ్చారు. వెంటనే ఉంగరాన్ని వో అద్దాల పెట్టెలో భద్రపరిచి 'న్యూయార్క్'లోని వో బ్యాంకు సేఫ్ లాకర్‌లో వుంచారు.

ఇప్పటికీ ఆ ఉంగరం బ్యాంకులోని లాకర్‌లోనే వుంది. బ్యాంకు అధికారులు దాన్ని అమ్ముతామని ప్రకటించినా ఆ వుంగరం కథ తెలిసిన వారెవరూ కొనటానికి ముందుకు రాలేదు.

ఇంతకు ఆ ఉంగరానికి, మనుషుల మరణాలకి సంబంధమేమిటో పోలీసులు ఎంత పరిశోధించినా కనుక్కోలేకపోయారు. ఏ అతీంద్రియ శక్తి ఆ వుంగరాన్ని ఆవహించుకుని దాన్ని ధరించిన వాళ్ళను బలి తీసుకుంటూ వుందో నేటికీ మిస్టరీగానే మిగిలిపోయింది.

